క్లుప్తంగా

సొసైటీ భవనం నిర్మించాలని వినతి

పెనమలూరు: గ్రామంలో అసంపూర్తిగా ఉన్న సొసైటీ భవన నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు ప్రత్యేకాధికారి, జిల్లా కోఆపరేటివ్ అధికారి వీవీ ఫణికుమార్‌కు మండల శుక్రవారం గ్రామదర్శినిలో వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు గ్రామస్తులు వివరాలు తెలుపుతూ గతంలో సొసైటీ చైర్‌పర్సన్‌గా ఉన్న బద్రినారాయణ సొసైటీ భవన నిర్మాణం చేపట్టారన్నారు. అయితే ఆయన పనులు పూర్తి చేయకుండా ఎం బుక్‌లో వివరాలు నమోదు చేయకుండా రూ. 9 లక్షల నిధులు డ్రా చేశారని వివరించారు. సొసైటీ భవన నిర్మాణం పూర్తి చేయనందున అద్దె భవనంలో కార్యకలాపాలు నిర్వహించాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సొసైటీ భవన నిర్మాణం చేపట్టి పూర్తి చేయాలని కోరారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం

ఉయ్యూరు: మండలంలోని పెద ఓగిరాల గ్రామంలో వేంచేసిన శ్రీ రామమందిర పునఃప్రతిష్టా మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. యార్వ భాస్కర్‌రెడ్డి, గుంటక వీరారెడ్డి, బొమ్మారెడ్డి రవికాంత్‌రెడ్డి, బొమ్మారెడ్డి నాగేశ్వరరెడ్డి కుటుంబాలతో పాటు గ్రామస్తులు వేదమంత్రోచ్ఛరణల నడుమ విగ్రహ ప్రతిష్టా, పూజా కార్యక్రమాలను జరిపించారు. హోమాలు చేయించి పోతురాజు స్తంభాన్ని ప్రతిష్టించారు. సీతారాముల వారి విగ్రహాలను భక్తుల రామనామ స్మరణ నడుమ ప్రతిష్ఠింపజేశారు. అనంతరం సీతారాముల కల్యాణం కనుల పండువగా సాగింది. గ్రామస్తులకు అన్నప్రసాద పంపిణీ చేశారు. పూజా కార్యక్రమాలను సర్పంచ్ త్రిపురం లక్ష్మి, ఆలయ కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



కంకిపాడు: ఏపీ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కంకిపాడు తాలుకా యూనిట్ ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో అసోసియేషన్ కంకిపాడు యూనిట్ అధ్యక్షుడిగా కంకిపాడు మండల పరిషత్ ఏఓ టి.ఉదయ్‌భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా కె.మాధవాచారి, జిల్లా కౌన్సిల్ -1గా కేటీవీ ప్రసాద్, జిల్లా కౌన్సిల్ -2గా కె.యాకోబు, ఉపాధ్యక్షులుగా వి.శైలజ, సంయుక్త కార్యదర్శిగా కె.ఫణీంద్రకుమారి, కోశాధికారిగా పి.విశ్వేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా శ్యాంసన్, ఎన్నికల పరిశీలకులుగా నాగేశ్వరరావు వ్యవహరించారు. కార్యక్రమంలో పెనమలూరు మండల పరిషత్ ఏఓ ఎల్.శివశంకర్, యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 11 మందికి ఉద్యోగాలు



ఉయ్యూరు: జాబ్‌మేళాలో 11 మందికి ఉపాధి అవకాశాలు లభించాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్), శిక్షణ కేంద్రంలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పనా కార్యాలయం, సీడప్ సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగులకు జాబ్‌మేళా నిర్వహించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు ఇంటర్వ్యూలు నిర్వహించి 11 మంది అభ్యర్థులను వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. జిల్లా నియామక కార్యనిర్వాహకులు తుర్లపాటి మధు, ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత

గన్నవరం రూరల్: వైఎస్సార్ బీమా పథకం పేదలకు ఆసరా అని మాదలవారిగూడెం సర్పంచ్ బుద్ధాల లక్ష్మీప్రసన్న అన్నారు. శుక్రవారం చనుపల్లివారిగూడెంలో మరణించిన వేల్పుల పెద్ద మంగయ్య కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం ద్వారా తక్షణ సహాయం కింద రూ.10 వేలు అందజేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ అనగాని సుందరయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

గన్నవరం రూరల్: గ్రామాల సమగ్ర ప్రగతి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ అనగాని రవి చెప్పారు. శుక్రవారం జక్కులనెక్కలం గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం పరిశీలించారు. ఎంపీపీ పాఠశాలలో బల్లలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయం సర్పంచ్ మాకుల చిరంజీవి ఎంపీపీ దృష్టికి తేగా సమస్యను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న పలువురు లబ్ధిదారులకు సచివాలయం ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన శాశ్వత పట్టాలను ఆయన పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి పొట్లూరి వెంకట మురళీ కృష్ణ, వీఆర్వో రవీంద్ర, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే గ్రామదర్శిని లక్ష్యం



నెప్పల్లి జెడ్పీ పాఠశాలలో వసతులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఎస్.వై.వి.ఎస్.మనోహరరావు

కంకిపాడు: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారమే గ్రామదర్శిని లక్ష్యమని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.వై.వి.ఎస్.మనోహరరావు అన్నారు. మండలంలోని నెప్పల్లి, కుందేరు, కోలవెన్ను గ్రామాల్లో శుక్రవారం గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించారు. నెప్పల్లి గ్రామంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.వై.వి.ఎస్.మనోహరావు, కుందేరులో సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు ఆఫీసర్ ఏ.శేఖర్, కోలవెన్ను గ్రామంలో గుడివాడ డీఎల్‌డీఓ కె.ఎస్.ఎస్.సుబ్బారావు పర్యటించారు. ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక, జెడ్పీ పాఠశాలలు, ఆరోగ్య ఉపకేంద్రాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం నాడు-నేడు ద్వారా చేపడుతున్న అభివృద్ధి, ప్రజలకు చేకూరుతున్న లబ్ధిని వివరించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి జగనన్న గోరుముద్ద ద్వారా విద్యార్థులకు సమకూరుతున్న పోషకాలను వివరించారు. నెప్పల్లి గ్రామంలో జిల్లా వ్యవసాయాధికారి మనోహరరావు రైతుభరోసా కేంద్రాన్ని సందర్శించారు. సీజన్ వారీగా తలెత్తే సమస్యలు, మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించే లక్ష్యంతోనే గ్రామదర్శిని కార్యక్రమం రూపొందించారని వివరించారు. కార్యక్రమంలో ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ నందిపాటి బిందుమాధవి, ఎంఈఓ కనకమహాలక్ష్మి, కందలంపాడు సర్పంచ్ బాయిరెడ్డి నాగరాజు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సమర్థంగా అమలు చేయాలి

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కో ఆపరేటివ్ అధికారి, మండల ప్రత్యేకాధికారి వీవీ ఫణికుమార్ అన్నారు. గ్రామదర్శినిలో భాగంగా శుక్రవారం ఆయన పెనమలూరు గ్రామంలో విస్తృతంగా పర్యటించి తనిఖీలు చేశారు. తొలుత గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు పరిశీలించారు. సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆయన ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు పరిశీలించారు. విద్యార్థులకు అమలు చేస్తున్న జగనన్న గోరు ముద్ద భోజనం ఆయన తిని నాణ్యతను చూశారు. ఎస్సీ బాలికల హాస్టల్‌లో కూడా భోజనం చేసి నాణ్యతను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం సక్రమంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సునితాశర్మ, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, సర్పంచి లింగాల భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ, హౌసింగ్ ఏఈ సత్యనారాయణరాజు, వీఆర్వో దేవప్రియుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పెనమలూరు పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న ప్రత్యేకాధికారి ఫణికుమార్



సూరంపల్లిలో మధ్యాహ్నం భోజనం రుచి చూస్తున్న ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు

గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లి గ్రామంలో శుక్రవారం గ్రామదర్శిని కార్యక్రమంలో ఫిషరీష్ ఏడీ సీహెచ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పులపాక బాబూరావు అధ్యక్షతన గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల, సంపద కేంద్రం నిర్వహణ పరిశీలన చేశారు. ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కోటా సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ముదునూరులో గ్రామదర్శిని



ముదునూరులో జగనన్న లే అవుట్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి జయప్రద, అధికారులు

ఉయ్యూరు: మండలంలోని ముదునూరు గ్రామంలో శుక్రవారం గ్రామదర్శిని నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి, అవనిగడ్డ వ్యవసాయశాఖ ఏడీఏ జయప్రద అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలో పర్యటించారు. పాఠశాలలను సందర్శించి విద్యాప్రగతిపై ఆరా తీశారు. జగనన్న లే అవుట్‌ను పరిశీలించి గృహ నిర్మాణ పురోగతిపై సమీక్షించారు. సచివాలయాన్ని సందర్శించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. స్థానికంగా ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ మొవ్వా వెంకట నాగలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు గంజి వెంకట స్వర్ణకుమారి, తహసీల్దార్ మస్తాన్, ఎంపీడీఓ విమాదేవి, హౌసింగ్ ఏఈ బుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెరటికోళ్ల పెంపకం లాభదాయకం



కంకిపాడులో పెరటికోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి



ఉంగుటూరులో కోళ్లు అందజేస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

కంకిపాడు: పెరటి కోళ్ల పెంపకం లాభదాయకమని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో 44 పెరటి కోళ్ల యూనిట్లను వివిధ గ్రామాలకు చెందిన మహిళలకు శుక్రవారం అందజేశారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లోని మహిళల ఆర్థిక ఉన్నతికి, సంక్షేమానికి, సాధికారతకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పెరటి కోళ్ల పెంపకం ద్వారా అవసరమైన పోషకాలు సమకూరటంతో పాటుగా ఆర్థికంగా కుటుంబాలను బలోపేతం చేసే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని కుటుంబాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీఎం సాంబశివరావు, సీసీలు, పలు గ్రామాల్లో వీఓఏలు పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పంపిణీ..

ఉంగుటూరు: గతంలో ఎన్నడు లేనివిధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతంలోని అక్కాచెల్లెళ్ల జీవనోపాధి మెరుగుపరిచేందుకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద స్వయం సహాయక గ్రూపుల మహిళలకు పెరటి కోళ్లను శుక్రవారం పంపిణీ చేశారు. వేసవిలో జాగ్రత్తలు తీసుకుని కోళ్ల పెంచుకోవాలని ఎంపీడీవో జీ.ఎస్వీ శేషగిరిరావు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఎం సాంబశివరావు, వీవోలు పాల్గొన్నారు.

వరకట్నం వేధింపులపై కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న భర్తపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప కాలువ కట్టకు చెందిన కొమ్ము వెంకటరమణ గత 13 సంవత్సరాల క్రితం నాగరాజును వివాహం చేసుకుంది. పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. భర్త కారు డ్రైవర్‌గా పని చేస్తాడు. వీరికి ఇద్దరు పిల్లలు. అయితే భర్త దురలవాట్లకు బానిసగా మారి భార్యను అదనపు కట్నం తీసుకమ్మని వేధించసాగాడు. దీంతో భార్య పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది.

టెన్త్ విద్యార్థులకు సాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు కల్వరిశక్తి చర్చి ఆధ్వర్యంలో ఉచితంగా పరీక్ష ఉపకరణాలు పంపిణీ చేశారు. బాపులపాడు, వేలేరు, రేమల్లే, మల్లవల్లి గ్రామాల్లోని జెడ్పీ హైస్కూళ్లలో పదోవ తరగతి చదువుతున్న 200 మంది విద్యార్థులకు శుక్రవారం పరీక్ష అట్టలు, పెన్నులు, జామెట్రీ బాక్సులను కల్వరి శక్తి చర్చి పాస్టర్ భూక్యా బాలరాజు శుక్రవారం పంపిణీ చేశారు. సర్పంచ్ చౌటపల్లి భారతి, హెచ్‌ఎం కొమ్మా విజయ్ పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజం లక్ష్యం



ఉయ్యూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు

ఉయ్యూరు: క్షయ రహిత సమాజం అందరి లక్ష్యం కావాలని మున్సిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉయ్యూరులో శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ చేపట్టారు. కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం కార్పొరేట్ వైద్య సేవలను ప్రజల ముంగిటకు తెచ్చిందన్నారు. ప్రభుత్వాస్పత్రిలో క్షయ వ్యాధికి ప్రత్యేకంగా వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తేజస్విని, సూపర్‌వైజర్లు శ్రీనివాసరావు, బేబీ, రమణమూర్తి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన

గన్నవరం: క్షయ వ్యాధి నిర్మూలనకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మన్నె సుందరరావు పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఐసీటీసీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్షయ వ్యాధి పట్ల నిర్లక్ష్యంగా ఉంటే ప్రాణపాయమని డాక్టర్ సారమ్మ చెప్పారు. హెచ్ఎస్ వీ సాంబశివరావు, టీబీ సూపర్‌వైజర్ రఘు తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ

విజయవాడ రూరల్: ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా మండలం లోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యార్థులు, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. నున్న గ్రామంలో మూడు సచివాలయాల పరిధిలో వైద్య సిబ్బంది స్కూల్స్ విద్యార్థులతో కలిసి క్షయవ్యాధిని అంతం చేద్దాం అంటూ ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ చేశారు. ప్రజల్లో అవగాహన కల్పించారు. సచివాలయం-3లో ఏఎన్ఎం, హృదయనగర్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆశవర్కర్లు ర్యాలీలో పాల్గొన్నారు. సచివాలయం -2లో జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సుస్మిత, సూపర్‌వైజర్లు కన్నబాబు, డీపీఎం రత్నం, ఆశ వర్కర్లు ర్యాలీలో పాల్గొన్నారు. సచివాలయం-1 పరిధిలో బోడపాడు, శాలివాహన ఏరియాలో ఏఎన్ఎం రజిని ఆధ్వర్యంలో క్షయవ్యాధి నివారణపై ర్యాలీ జరిగింది. పాతపాడు గ్రామంలో ఏఎన్ఎం నవత ఆధ్వర్యంలో విద్యార్థులు ఆశావర్కర్లు ర్యాలీ నిర్వహించారు. అంబాపురం గ్రామంలో ఏఎన్ఎం భూలక్ష్మి ఆధ్వర్యంలో ఆశావర్కర్లు, విద్యార్థులు ర్యాలీ చేశారు.

రంజాన్ ప్రార్థనలు ప్రారంభం



మసీదులో భక్తులకు సందేశమిస్తున్న ఇమామ్ ఇక్బాల్

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద జామియా మసీద్‌లో రంజాన్ మాసం మొదటి శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఇమాం హసీన్ ఇక్బాల్ భక్తులకు రంజాన్ మాస ఉపవాసాల విశిష్టతను వివరించారు. మొదటి శుక్రవారం కావటంతో విశేషంగా పెద్ద సంఖ్యలో భక్తులు ప్రార్థనల్లో పాల్గొన్నారు.

సంక్షిప్తం

• నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం గన్నవరంతో పాటు పరిసరా ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల ఆపరేషన్ ఈఈ పి.హరిబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్, శ్రీనగర్‌కాలనీ, దావాజిగూడెం రోడ్డు, పాత ఎస్‌బీఐ రోడ్డు, మదర్‌థెరిస్సా కాలనీ, ఎంపీడీవో ఆఫీస్ ఏరియా, సుబ్బారావునగర్, విద్యానగర్, దావాజిగూడెం, అల్లాపురం, రాజీవ్‌నగర్ కాలనీ, ఎస్టీబీఎల్ కాలనీ, పామర్తినగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

• ముగిసిన వర్క్‌షాప్

ఉంగుటూరు: తేలప్రోలులోని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రైమవేరా సాఫ్ట్‌వేర్‌పై 5రోజులుగా నిర్వహిస్తు వర్క్‌షాప్ శుక్రవారంతో విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం, ప్రిన్సిపాల్ ప్రసాద్ మాట్లాడుతూ సివిల్ ఇంజినీరింగ్ రంగంలో ప్రైమవేరా సాఫ్ట్‌వేర్, దాని అప్లికేషన్‌లపై లోతైన అవగాహన కల్పించేందుకు వర్క్‌షాప్ నిర్వహించామన్నారు. సివిల్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ శివకుమార్‌బాబు నేతృత్వంలో రిసోర్స్ పర్సన్ ప్రసన్నకుమార్, త్రివేణీ వర్క్‌షాప్‌ను సమన్వయం చేశారు.

• నేత్ర సమస్యల పరిష్కారానికే కంటి వెలుగు

కంకిపాడు: కంటి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేస్తుందని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వీవీ రాజేష్‌కుమార్ అన్నారు. కంకిపాడు పట్టణంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. రాజేష్‌కుమార్ 110 మంది వృద్ధులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, కళ్లజోళ్లు అందించారు.

• పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

గన్నవరం రూరల్: బాలలకు పోషకాహారం ప్రభుత్వం సమర్థంగా అందజేస్తుందని చిన అవుటపల్లి సర్పంచ్ గోగులమూడి విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాలలు పోషక విలువలు కోల్పోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పలు రకాల ఆహార ప్రదార్థాలను ప్రదర్శించారు. సీఎంఎస్‌కే వెంకట రమణ, ఏఎన్ఎం కన్నమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ సుప్రియ, అంగన్‌వాడీ కార్యకర్త ఎస్.నాగలక్ష్మి పాల్గొన్నారు.

• జెడ్పీ హైస్కూల్‌కు స్టీల్ గ్లాసుల వితరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: విద్యార్థి దశలోనే క్రమశిక్షణ, నైతిక విలువలు అలవర్చుకుంటేనే భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరుకోవచ్చని సాయి ఫ్లెవుడ్ అండ్ హార్డ్‌వేర్ అధినేత కట్టా నరేంద్ర అన్నారు. స్థానిక నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు జగనన్న గోరుముద్దలో భాగంగా రాగిజావ పంపిణీ చేసేందుకు వీలుగా రూ.10 వేలు విలువ చేసే 200 స్టీల్ గ్లాసులను నరేంద్ర శుక్రవారం అందించారు. ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ సుంకర సుభాష్‌చంద్రబోస్ పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా మహిళలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: డ్వాక్రా అక్కాచెల్లెమ్మలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్నో ఆర్థిక ఇబ్బందులు తట్టుకుంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'వైఎస్సార్ ఆసరా' పథకాన్ని అమలు చేస్తున్నారని పలువురు ప్రజా ప్రతినిధులు కొనియాడారు. బాపులపాడు మండలం వీరవల్లి, పెరికీడులో వైఎస్సార్ ఆసరా మూడో విడత కార్యక్రమంపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వందలాదిగా తరలివచ్చిన డ్వాక్రా మహిళలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జయ జయ ధ్వానాలు పలికారు. సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వీరవల్లిలో 160 డ్వాక్రా గ్రూపులకు రూ.1.11 కోట్లు, పెరికీడులో 73 డ్వాక్రా గ్రూపులకు రూ.91.34 లక్షలు మేర వైఎస్సార్ ఆసరా ద్వారా లబ్ధి చేకూరిందని ఏపీఎం భూపతిరావు తెలిపారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, వైస్ ఎంపీపీ పండు రాణి, పెరికీడు సర్పంచ్ వల్లపోతు జాన్ ప్రకాష్, మాజీ సర్పంచ్ తవ్వా హేమేశ్వర నరసింహామూర్తి, వీరవల్లి పీఏసీఎస్ చైర్మన్ అల్లాడి థెరిస్సా, ఎంపీటీసీ సభ్యురాలు దూసరి నిర్మల, సీసీలు కమల కుమారి, షణ్ముఖ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కంకిపాడు లాకురోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభం



కంకిపాడు లాకురోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న సచివాలయాల మండల ఇన్‌చార్జి రాచూరి

కంకిపాడు: ఎంతో కాలంగా అభివృద్ధి కోసం ఎదురుచూస్తున్న కంకిపాడు లాకురోడ్డు అభివృద్ధి పనులు శుక్రవారం ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. కంకిపాడు లాకురోడ్డు అభివృద్ధికి జిల్లా పరిషత్ గ్రాంటు రూ. 50 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో రోడ్డు అభివృద్ధి పనులను చేపట్టేందుకు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఇటీవల శంకుస్థాపన చేశారు. రోడ్డు పనులు చేపట్టేందుకు ప్రొసీడింగ్స్ తాజాగా జారీ అవ్వటంతో అభివృద్ధి పనులను చేపట్టారు. రోడ్డు పనులకు కంకిపాడు ఉపసర్పంచ్, జగనన్న సచివాలయాల మండల ఇన్‌చార్జి రాచూరి చిరంజీవి పరిశీలించారు. నిధులు సద్వినియోగం అయ్యేలా చర్యలు తీసుకుంటామని, త్వరితగతిన రోడ్డు పనులు పూర్తయ్యి, ప్రజల ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభించేలా చర్యలు చేపడతామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చిట్టూరి ప్రసాద్, ఈఓ రామకృష్ణ, పార్టీ నాయకులు చింతల అప్పారావు, బాకీ రాజు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు అవసరం



బహుమతులు అందజేస్తున్న లక్ష్మిషా, శ్రీకృష్ణ, ఏకాంబరం నాయుడు

రామవరప్పాడు: మారుతున్న ప్రపంచీకరణ నేపథ్యంలో నూతన పుంతలు తొక్కుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు పట్టు సాధించాలని ఏపీ ఎస్‌హెచ్‌సీఎల్ మేనేజింగ్ డైరెక్టర్, ఐఎఎస్ జీ లక్ష్మిషా అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల 16వ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి లక్ష్మిషా మాట్లాడుతూ పరిపూర్ణమైన విద్యార్థులకు ఉద్యోగాలివ్వడానికి కార్పొరేట్ కంపెనీలు పోటీ పడుతున్నాయన్నారు. ఎస్సార్కే ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు మాట్లాడుతూ కళాశాలలోని 75 శాతం విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారన్నారు. గత సంవత్సరం పీహెచ్‌డీ పూర్తి చేసిన విద్యార్థులను అభినందించారు. అనంతరం అకడమిక్, కల్చరల్ కార్యక్రమాలల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఎస్సార్కే ఫౌండేషన్ సెక్రటరి బోయపాటి శ్రీకృష్ణ, పలు విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలకు భూములు కేటాయించాలి

కంకిపాడు: దళితవాడల శ్మశానవాటికలకు అవసరమైన భూములను కేటాయించాలని పీవీ రావు మాల మహానాడు ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు గోగులమూడి రాజు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తహసీల్దార్ టీవీ సతీష్‌ను కలిసి శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాజు విలేకరులతో మాట్లాడుతూ దళితవాడలకు సరిపడినట్లు శ్మశానవాటికలు లేకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి అవసరమైన భూములను శ్మశాన వాటికలకు కేటాయించాలన్నారు. శ్మశాన వాటికల అభివృద్ధి పనుల్లో భాగంగా తాగునీటి బోర్లు, షెడ్ల నిర్మాణం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం పెనమలూరు నియోజకవర్గ అధ్యక్షుడు పి. రామకృష్ణ, సలహాదారు బేతాళ అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు ఎత్తుకు తగ్గ బరువు ఉండాలి

గన్నవరం: పిల్లల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు ఎత్తుకు తగ్గ బరువు ఉండాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ సీహెచ్.నాగ పద్మావతి సూచించారు. స్థానిక ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం-2లో గురువారం గ్రోత్ మానిటరింగ్ డ్రైవ్ నిర్వహించారు. ఆరేళ్లలోపు చిన్నారులకు బరువు, ఎత్తు కొలతలు వేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. పిల్లల ఎత్తుకు తగ్గ బరువు ఉండేందుకు మంచి పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలని చెప్పారు. ఎంపీటీసీ సభ్యులు తిరివీధి రవి పాల్గొన్నారు.